మంత్రి పొంగులేటికి సన్మానం



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పబ్లిక్ రిలేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని గురువారం జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలను మంత్రికి వివరించారు. జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని ఆయన కోరారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం శుభ పరిణామం

హిమాయత్‌నగర్: శాసనసభలో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయడంపై డాడి లంబాడీ హక్కుల సాధన సమితి (డీఎల్‌హెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రఘు నాయక్ రూడావత్ హర్షం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర పరిస్థితులను ప్రజలకు వివరించడం శుభ పరిణామమని కొనియాడారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేయగా ఒక్కో పార్టీ ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని, అందరూ పార్టీలకతీతంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమ పార్కింగ్‌లతో తప్పని ఇబ్బందులు

- ఇరుకుగా మారుతున్న రోడ్లు
- పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కాచిగూడ: రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్‌లతో రోడ్లు కుంచించుకుపోయి స్థానికులు, వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాచిగూడ డివిజన్‌లోని కాచిగూడ స్టేషన్ రోడ్డు, కుద్బిగూడ, నింబోలిఅడ్డ, సుప్రభాత్ బ్యాక్‌సైడ్ చెప్పల్ బజార్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో వాహనదారులు రోడ్లపై అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు కుంచించుకుపోయి ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- కాచిగూడ చౌరస్తా, లింగంపల్లి చౌరస్తాలోని హోటల్స్ ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా రోడ్డుపై పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన నో పార్కింగ్ స్థలాల్లో కూడా వాహనాలను యథేచ్ఛగా నిలుపుతున్నారు.

తాగుబోతుల బెడద..

- కుద్బిగూడ రోడ్డులో వైన్‌షాపు ఉండటంతో తాగుబోతులు మందు కొనుగోలు చేసి మున్నూరు కాపు సంఘం బ్యాక్‌సైడ్ రోడ్డులో వాహనాల మధ్య కూర్చొండి మద్యం సేవిస్తున్నారని స్థానికులు తెలిపారు. దీంతో రాత్రి సమయాల్లో ఆ రోడ్డు మీదుగా నడవాలంటేనే భయంగా ఉంటుందని తెలిపారు. మున్నూరుకాపు భవన్‌లో మ్యాడం అంజయ్య హాల్ ఫంక్షన్ హాల్ ఉండటంతో ఫంక్షన్‌కు వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ వ్యవహారం బహిరంగమే అయినా పోలీసులు అక్రమ పార్కింగ్‌పై, ఇతర కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్‌ను తొలగించి, తాగుబోతుల బెడద లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలను చూసి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు దాన్ని పట్టించుకోవడమే మరచిపోయారు.



కుద్బిగూడ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో కాచిగూడలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల అక్రమ పార్కింగ్‌కు 'చెక్' పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మున్నూరు కాపు భవన్ బ్యాక్‌సైడ్ రోడ్డులో..

- కుద్బిగూడ నుంచి చెప్పల్ బజార్ వైపునకు వెళ్లే మున్నూరుకాపు భవన్ బ్యాక్‌సైడ్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై వాహనాలు అడ్డుగా ఉన్నందున రోడ్లపైనే మూత్రవిసర్జన చేస్తుండటంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటేనే దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. వాహనాల అక్రమ పార్కింగ్‌ను తొలగించారు. మున్నూరుకాపు సంఘం కాంపౌండ్ వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో ప్రహరీకి సపోర్టుగా మొక్కలను నాటించారు. వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు.



పార్కింగ్ చేసిన వాహనాల మధ్య చెత్తను వేస్తున్న దృశ్యం



సుప్రభాత్ కాంప్లెక్స్ బ్యాక్‌సైడ్ రోడ్డులో...



మున్నూరుకాపు భవన్ వెనుక వాహనాలు

వైకుంఠ ఏకాదశికి న్యూరామాలయం ముస్తాబు

- ఉత్తర ద్వార దర్శనానికి పటిష్ట ఏర్పాట్లు
- భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలి



న్యూ నల్లకుంటలోని న్యూరామాలయం

నల్లకుంట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు ఉంటాయని ఆలయ ఈవో జయంతి గురువారం తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం , అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. ఉదయం 8.30 గంటలకు రథంపై ఇష్ట దైవాల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని వివరించారు. కోవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని భక్తులకు సూచించారు.

తెలుగు సీరియల్స్‌కు ఆరంభం అనగనగా ఒక శోభ



పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలుగు సీరియల్స్ ఆరంభం దూరదర్శన్‌లో 37 ఏళ్లక్రితం వచ్చిన అనగనగా ఒక శోభతోనేనని దూరదర్శన్ యాదగిరి పూర్వ డైరెక్టర్ విజయ భగవాన్ చెప్పారు. గురువారం త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ కళానిలయం నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో మహానటి సావిత్రితో బాల నటిగా నటించిన పూర్ణిమకు సావిత్రి స్మారక పురస్కారం గాయని సంయుక్తకు సంగీత సావిత్రి బిరుదు అతిథులు బహూకరించారు. అనగనగా ఒక శోభలో నటించిన కథానాయకుడు ప్రదీప్‌ను దర్శకుడు ప్రభ కథానాయకి శిల్పలకు ఆత్మీయ సత్కారం చేశారు. ముఖ్య అతిథిగా విజయభగవాన్ పాల్గొనగా గాయని హైమవతి భీమన్న అధ్యక్షత వహించారు. వంశీ రామరాజు, జర్నలిస్ట్ అక్కినేని వెంకట్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. సురేందర్ స్వాగతం పలికిన సభకు కార్యదర్శి పుష్ప నివేదిక సమర్పించారు. తొలుత సంయుక్త సహ గాయకులతో కలసి పాడిన పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు.

నేటి నుంచి ఛాతీ ఆస్పత్రిలో కోవిడ్ పరీక్షలు



డాక్టర్ మహబూబ్‌ఖాన్

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో శుక్రవారం నుంచి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజన్ టెస్టులు చేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఏడాది రోగులకు అధికంగా టెస్టులు చేయనున్నామని పేర్కొన్నారు. రోజూ వందల సంఖ్యలో తమ ఆస్పత్రికి శ్వాసకోశ వ్యాధితో బాధపడేవారు వస్తుంటారని, వారిని పరీక్షించి అవసరమైన వారికి అన్ని పరీక్షలు చేసి అనుమానితుల శాంపిల్స్ గాంధీ ఆస్పత్రికి పంపనున్నామన్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే వారికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు చేస్తామన్నారు. గురువారం ఒక్కరోజే నార్మల్‌గా అడ్మిట్ అయిన వారిలో అనుమానం ఉన్న 29 మంది శాంపిల్స్ గాంధీ ఆస్పత్రికి పంపామన్నారు. వారిలో పాజిటివ్ వచ్చిన వారిని ఐసోలేషన్ చేసి కోవిడ్ వార్డులోకి తరలించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే ఆస్పత్రిలో అన్ని శ్వాసకోశ రోగులకు, కోవిడ్ రోగులకు విడివిడిగా బెడ్స్ సిద్ధం చేశామని వివరించారు.

శ్రీరామ పాదుకలకు పూజలు



శ్రీరాముని పాదుకలు



పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

నల్లకుంట: శృంగేరిలో ప్రత్యేకంగా తయారు చేయించి ఓ పెట్టెలో భద్రపరిచిన శ్రీ రాముడి వెండి పాదుకలు, కలశాలను సౌందర్య లహరి ప్రతినిధి బృందం గురువారం అంబర్‌పేట నియోజకవర్గం ప్రజల దర్శనార్థం వివిధ ఆలయాలకు తీసుకొచ్చారు. న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయానికి తీసుకొచ్చిన శ్రీరాముడి పాదుకలు, వెండి కలశాలతో పాటు శ్రీ సీతా రామచంద్ర స్వామి లక్ష్మణ, హనుమ విగ్రహాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాగ్ అంబర్‌పేటలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయానికి తీసుకొచ్చారు. గురువారం మధ్యాహ్న హారతికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు రాముడి పాదుకలు, కలశాలను భక్తి శ్రద్ధలతో దర్శించుకొని తరించారు. కొందరు భక్తులు ఈ పాదుకలను తమ సెల్ ఫోన్‌లతో ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా లహరి ప్రతినిధులు మాట్లాడుతూ... ఈ పాదుకలను భక్తుల సందర్శనం కోసం రోజూ వివిధ రాష్ట్రాల్లోని ఆలయాలకు పంపించనున్నట్లు వివరించారు. రామ మందిర ప్రారంభ రోజైన వచ్చే ఏడాది జనవరి 24వ తేదీన పవిత్రమైన ఈ పాదుకలు ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యకు చేరుకుంటాయని చెప్పారు. అయోధ్య ట్రస్టు ప్రతినిధులకు పాదుకలను అందజేస్తారని సౌందర్య లహరి ప్రతినిధులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ సుభాష్ సమాచారం మేరకు... కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా బాలాజీ దర్శన్ హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించి ఉన్నాడు. మృతుడి ఒంటిపైన బ్లాక్ అండ్ వైట్ చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ఉంది. మృతుడు హిందూ బెగ్గర్ అని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న కళాకారులకు అవార్డుల ప్రదానం

లిబర్టీ: ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. ఇంద్రజాల మాంత్రికుడు పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ స్మారకార్థం ఆ రంగంలో ప్రావీణ్యత ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మిమిక్రీ ఆర్టిస్ట్ ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ పీఎం కాలేజ్ ఆడిటోరియంలో జరుగుతుందని వివరించారు.

నేడు ప్రభుత్వ యూనివర్సిటీలపై మేధోమథనం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాయాలు ఏం కోరుకుంటున్నాయి? అనే అంశంపై నేడు (22న) ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మేధో మథనం జరగనుంది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి ఓయూ విశ్రాంత అధ్యాపకులు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఏఐఎస్ఎఫ్ నేత నెల్లి సత్య తెలిపారు.

నిరుద్యోగ భృతి వద్దు.. ఉద్యోగమే ముద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ భృతి వద్దు ఉద్యోగమే ముద్దు అని ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి, నిరుద్యోగుల పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన మాజీ సీఎం కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు రాజకీయ నిరుద్యోగులు స్వలాభం కోసం మరోమారు నిరుద్యోగులను మోసగించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యేసుబాబు, జాన్సీ, అనిల్‌కుమార్, ప్రమోద్, లక్ష్మణ్, మహాదేవ్, సింహాద్రి, అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో దివ్యాంగుల పాత్ర కీలకం



వికలాంగుల ర్యాలీలో పాల్గొన్న గౌతంరావు, కావ్యా కిషన్ రెడ్డి

కాచిగూడ: సమాజంలో దివ్యాంగులు సాధిస్తున్న విజయాలు మనందరికీ ఆదర్శనీయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి బర్కత్‌పుర చమన్ వరకు వికలాంగుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య జి.కావ్యా కిషన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు ఆర్థిక, సామాజికంగా వృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. సమాజంలో వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ సహాయ గుణంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికలాంగుల రిజర్వేషన్లు మూడు శాతం నుంచి నాలుగు శాతం పెంచారని అన్నారు. అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ... సమాజంలో మమ్మల్ని భాగస్వాములుగా చేయండి, మాకు అవకాశాలు ఇవ్వండి, మేము కూడా రాజ్యాధికారంలో భాగస్వామ్య దిశగా అన్ని పార్టీలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, అమృత, బీజేపీ నేతలు పాతకోటి మహేష్, అజయ్‌కుమార్, రమేష్ యాదవ్, మహంకాళి రవీందర్, శ్రీనివాస్, శంకర్, గోవింద్ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిని అవమానించడం సిగ్గుచేటు: బీజేపీ



బర్కత్‌పుర చమన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

కాచిగూడ: ప్రజల మద్దతుతో ఎన్నికలలో గెలిచి, ప్రజల మనోభావాలను కొంత మంది ఎంపీలు దెబ్బతీయడం దారుణమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. పార్లమెంట్‌లో సభ నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కారణంగా పార్లమెంట్‌లో సస్పెండైన ఎంపీలు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ని అవహేళన చేయ్యడం సిగ్గుచేటని అన్నారు. ఉపరాష్ట్రపతిని అవహేళన చేసినందుకు నిరసనగా గురువారం బర్కత్‌పుర చమన్ వద్ద నల్ల జెండాలతో బీజేపీ నేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, సి.కృష్ణయాదవ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, ఎ. సూర్యప్రకాష్ సింగ్, ఎడెల్లి అజయ్ కుమార్, కేసరి నర్సింగ్ యాదవ్, రాహుల్ చంద్ర, మల్లికార్జున్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భవన్‌కు వచ్చిన వృద్ధురాలి అదృశ్యం



బాసమ్మ

పంజగుట్ట: ప్రజా భవన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు కనిపించకుండా పోయిన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నారాయణపేట జిల్లా మద్దూర్ మండలానికి చెందిన బి.వెంకటయ్య అతని భార్య బి.బాసమ్మ(65) ఈ నెల 15వ తేదీన జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్‌లో వినతి పత్రం సమర్పించేందుకు వచ్చారు. వినతి పత్రం ఇచ్చి ఇంటికి వెళ్లే క్రమంలో బస్సు ఎక్కేందుకు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చారు. వెంకటయ్య టాయిలెట్‌కు వెళ్లివస్తాను ఇక్కడే ఉండు అని చెప్పి ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చే సరికి బాసమ్మ కనిపించకుండా పోయింది. చుట్టుపక్కన వెతికినా కనిపించకపోవడంతో సొంత గ్రామం వెళ్లి వెతికాడు. అక్కడా కనిపించకపోవడంతో పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ బ్రాండింగ్‌కు అవార్డు

లక్డీకాపూల్: టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ మరోసారి ప్రతిష్టాత్మకమైన పెప్పర్ అవార్డ్స్ 2023 కాంస్య ట్రోఫీని సాధించింది. సృజనాత్మక నైపుణ్యం, వినూత్న బ్రాండింగ్ వ్యూహాలతో కూడిన అద్భుతమైన ప్రదర్శనలో తన ఆధిక్యతను నిరూపించుకుంది.ఈ అవార్డులు, అత్యుత్తమ ప్రమాణాలకు బెంచ్‌మార్క్, బ్లాక్ గోల్డ్‌గా నిర్వాహకులు పేర్కొంటున్నారు. 'సెంట్రో షూస్' ఇంటిగ్రేటెడ్ రిటైల్, ఈ-కామర్స్ బ్రాండింగ్ సీజన్ ముగింపులో అమ్మకాల్లో ఈ అవార్డును సొంతం చేసుకున్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తామని మంత్రి పొన్నం హామీ



మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్

హిమాయత్‌నగర్: కార్మికుల సంక్షేమం, హక్కులు, చట్టాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వారికి త్వరలో న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోదాం మల్లేష్ గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు శంకర్ లాల్ రామావత్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బందం గురువారం మంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ ఆటో డ్రైవర్లకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఇ.నాగరాజు, మల్లేష్, శంకర్, బోడ్యానాయక్, రాములునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాధుర్యం.. అన్నా మధుసూదనరావు గానం



మధుసూదన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: వృత్తి రీత్యా అమెరికాలో స్థిరపడినా తెలుగు మాటను, పాటను ఆరాధించే అన్నా మధుసూదన్‌రావు ఘంటసాల పాటలను గళ మాధుర్యంతో అలరించారని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం రాత్రి త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై ఘంటసాల స్వరపట్టాభిషేకం పేరిట సినీ గాన విభావరి జరిగింది. అన్నా మధుసూదనరావు, పి.నాగేశ్వర్‌రావు, ప్రణీత చంద్రలతో పాటు అకాడమీలో శిక్షణ పొందిన గాయనీగాయకులు పలు పాటలను ఆలపించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళా పోషకులు అశ్వినీ సుబ్బారావు, పీవీ రంగారావు, మహబూబ్‌నగర్ ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షుడు జగదీశ్వర్ అన్న మధుసూదన్‌రావును సత్కరించారు. అకాడమీ స్థాపకుడు ప్రముఖ గాయకుడు శరత్ చంద్ర మాట్లాడుతూ... ఘంటసాల సంగీత కళాశాల ఇంటర్నేషనల్‌కు అన్నా మధుసూదన్‌రావు అధ్యక్షుడిగా నియమించామన్నారు. ఆయన ఘంటసాల పాటలను విశ్వవ్యాప్తం చేస్తున్నారని వివరించారు. ఈల పాట గాయకుడు డాక్టర్ రామ్ మనోహర్, డి.లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు. శివరమ్య వ్యాఖ్యానంతో జరిగిన కార్యక్రమంలో ఐడల్ గాంధర్వ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. పీఎంకే. గాంధీ వ్యాఖ్యానం సందర్భోచితంగా ప్రేక్షులను ఆకట్టుకున్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా స్పందన అమోఘం



అమిత్‌షాకు వినతి పత్రం ఇస్తున్న సుదర్శన్‌రావు

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారికి ఇస్తున్న అన్ని బెనిఫిట్స్‌ను కల్పించాలని తాము కేంద్రమంత్రి అమిత్‌షాకు వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రధాన కార్యదర్శి దుశర్ల సుదర్శన్‌రావు తెలిపారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమకారులను తెలంగాణ సాధకులుగా గుర్తించి స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చినట్లుగానే పింఛన్లతో పాటు రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, నివాస యోగ్యం కూడా అందించాలని విజ్ఞప్తి చేయగా ఈ విషయంపై పరిశీలన జరిపి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడం తమను ఎంతగానో ఆనందానికి గురిచేసిందన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర తరతరాలకు గుర్తిండిపోయేలా 100 ఎకరాల్లో స్మృతి వనం నిర్మించాలని విజ్ఞప్తి చేయగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

రేపు, ఎల్లుండి గీతా ప్రవచనాలు

వెంగళరావునగర్: శ్రీనగర్‌కాలనీ బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో భగవద్గీత ప్రవచనాల కార్యక్రమాన్ని సిద్ధార్థనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల పాటు జరుగుతుందన్నారు. అంతర్జాతీయ గీత స్పీకర్, శిక్షకులు బి.కె.త్రినాథ్ గీతా ప్రవచనాలను తెలియజేస్తారన్నారు. గీతలోని ఆధ్యాత్మిక రహస్యం, అంతరంగిక శాంతి, సుఖం కోసం యోగా అభ్యాసం తదితర అంశాలను ఆయన భక్తులకు వివరించనున్నారని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24న ప్రవాసి తెలంగాణ దివస్

పంజగుట్ట: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యూఎస్ఏ (టీడీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 24న రవీంద్రభారతిలో ప్రవాసీ తెలంగాణ దివస్ నిర్వహిస్తున్నట్లు టీడీఎఫ్ అధ్యక్షులు దివేష్ అవిరెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను అడ్వైజర్ డీ.పీ. రెడ్డి, మాజీ అధ్యక్షురాలు కవితా చల్లా, మురళి చింతలపాటితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. టీడీఎఫ్ 25 సంవత్సరాల క్రితం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ప్రారంభించారని గుర్తు చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి ప్రవాసి తెలంగాణ దివస్ నిర్వహిస్తామని కార్యక్రమంలో భాగంగా పుట్టిన గడ్డపైకి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, వ్యవసాయం , మహిళాసాధికారతపై వివిధ కార్యక్రమాలు చేస్తుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడం, గ్రామాలను దత్తత తీసు కుని అభివృద్ధి చేయడం, మెడికల్ క్యాంపులు ఏర్పా టు చేస్తుంటామన్నారు. 24వ తేదీన తెలంగాణలో విశేష సేవలు అందిస్తున్న ఎన్ఆర్ఐలకు సన్మానం, వివిధ రంగాల్లో సేవ చేసిన వారి ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.